‘ప్రజావాణి’ దరఖాస్తులను పరిష్కరించండి


దరఖాస్తులను స్వీకరిస్తున్న మేయర్ అమర్‌సింగ్


దరఖాస్తు అందజేస్తున్న సాయిహిల్స్ కాలనీవాసులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన ‘ప్రజావాణి’ కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను సోమవారం స్వీకరించారు. సుమారు 7 దరఖాస్తులు అందాయని మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, టీపీఓ సుకన్య తదితరులు పాల్గొన్నారని కమిషనర్ త్రిలేశ్వర్ రావు తెలిపారు.

పార్కుకు రక్షణ ఏర్పాటు చేయండి..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ సాయిహిల్స్ కాలనీలోని పార్కు స్థలానికి కంచవేసి పార్కు స్థలాన్ని అభివృద్ధి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని సోమవారం సాయిహిల్స్ నూతన కమిటీ అధ్యక్షుడు మధుసూధన్, కమిటీ సభ్యులు ప్రజావాణిలో మేయర్ అమర్‌సింగ్‌కు వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు కాలనీవాసులు పేర్కొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీలోని పిల్లలకు ఆడుకునేందుకు సరైన స్థలం లేక వీధుల్లోకి వెళ్లి ప్రమాదాలకు గురౌతున్నారని అవేదన వ్యక్తం చేశారు. కాంపౌండ్‌వాల్ నిర్మాణం వల్ల పార్కు రక్షణ కల్పించడంతో పాటు పెద్దలకు విశ్రాంతి స్థలం, చిన్నారులకు ఆటస్థలం, కాలనీలో మంచి వాతావరణం ఏర్పడుతుందని కాలనీవాసులు చెప్పారు. అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజంతోనే దేశాభివృద్ధి


ఉప్పల్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఉప్పల్ : అవినీతి రహిత సమాజంతోనే దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందని ఉప్పల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.విజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్ వారి అవగాహన వారోత్సవాల సందర్భంగా భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వారి భాగసామ్యంతో ‘అవినీతి’ అనే అశంపై డిగ్రీ కళాశాలలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిఎా చారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, పురోగతికి అవినీతి ప్రధాన అవరోధమని, నిఘా, జాగృతి వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో బెల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, యూనిట్ విజిలెన్స్ అధికారి రూత్ బెక్కం లు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం క్విజ్, వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకం

బోడుప్పల్: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులు నిర్వహించడంలో కీలకపాత్ర పోషిస్తారని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థలో మేనేజర్‌గా పనిచేసిన మర్రి అంజిరెడ్డి సోమవారం ఏర్పాటు చేసిన ఉద్యోగ పదవీవిరమణ వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని వారి దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతకు కట్టుబడి తమ జీవితకాలం మొత్తం పనిచేస్తారన్నారు. అంజిరెడ్డి కిందస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ.. మేనేజర్ స్థాయిలో పదవీవిరమణ పొందారన్నారు. కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, చీరాల నర్సింహ్మ, కొత్త చందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ– బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.


మర్రి అంజిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్


స్థానికులతో ఐలా కమిషనర్ ప్రభాకర్

అభివృద్ధి పనులకు ఆటంకం

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని భూగర్భ డ్రైనేజీ నిర్మాణపనులను దుర్గానగర్ కాలనీవాసులు సోమవారం అడ్డుకున్నారు. రూ.1.25 కోట్లతో హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపం నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు మీదుగా దుర్గానగర్ కాలనీకి వెళ్లే డ్రైనేజీ లైన్ పనుల విషయంలో టీఎస్ఐఐసీ కమిషనర్ స్థానికుల అభిప్రాయాన్ని తీసుకోకుండానే నిర్ణయం తీసుకుని నిధులు మంజూరు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో టీఎస్ఐఐసీ ఐలా కమిషనర్ ప్రభాకర్ నేతృత్వంలో టెక్నికల్ డీఈఈ అంజయ్య, ఏఈ అనిల్‌కుమార్‌లను పైపు లైన్ నిర్మాణ పనులను సందర్శించి పరిశీలించారు. కాలనీవాసులు సర్వేష్, పొన్నాల రాజు, మహేందర్, అన్వర్, మున్నాభాయ్, నయీమ్, వెంకటేష్, ఫక్రుద్దీన్, యూనస్, మల్లేష్, శ్రవణ్, విజయ్‌రాజు, నరేష్ జబ్బర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి


జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలితో ఎమ్మెల్యే బండారి

కాప్రా: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వివరించారు. సోమవారం కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఉప్పల్ నియోజకవర్గంలోని డివిజన్లలో సీసీ రోడ్లు, కమ్యూనిటీహాల్స్, శ్మశానవాటికల్లోని వివిధ సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ తక్షణమే పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. భైరి నవీన్‌గౌడ్, మహేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి..

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఓల్డ్ మల్లాపూర్‌లో సీసీరోడ్లు, రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు, థీమ్ పార్కు పనులకు నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరగా.. సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. త్వరలో మల్లాపూర్‌లో పర్యటించనున్నట్లు చెప్పారు.

భగాయత్ బస్తీలను విలీనం చేయాలి..

రామంతాపూర్: భగాయత్ కాలనీలో బస్తీలు ఏర్పడి 20 ఏళ్లు గడుస్తున్నా ఇంకా జీహెచ్‌ఎంసీ పరిధిలోకి విలీనం చేయకపోవడంతో ఆ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటాకు వినతిపత్రం అందజేశారు. ఈ స్థలాలపై గత ప్రభుత్వం డీ నోటిఫై చేసి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు అధికారుల అలసత్వం వల్ల జీహెచ్‌ఎంసీలో విలీనం కాలేదని వెంటనే ఈ బస్తీలను కాలనీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. జోనల్ కమిషనర్‌తో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.


జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి


జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

కేఆర్‌సీ ఎగ్జిబిషన్ ప్రారంభం

మేడిపల్లి: నిత్యం బిజీగా ఉండే ప్రజలకు కేఆర్‌సీ ఎగ్జిబిషన్ వినోదాన్ని పంచుతుందని పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్ అన్నారు. ఉప్పల్ డిపో వద్ద సోమవారం ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అత్యంత ఖరీదైన ఆర్‌ఆర్‌ఆర్ సెట్టింగ్ నమూనా ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. ప్రతి రోజు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10 వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, సోలంబో, డ్రాగన్, ట్రిన్, బోట్ రైడ్, బౌన్సర్, కొలంబస్, మెరిగో రౌండ్, జువెలరీ స్టాల్స్, రెడీమేడ్ స్టాల్స్, డ్రైఫ్రూట్స్, ఫుడ్‌స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని వివరించారు.

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

అల్వాల్: రైతులపై రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద ప్రజాప్రతినిధుల రైతు హామీల సాధన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మచ్చబొల్లారం డివిజన్ నుంచి బీజేపీ నేతలు తరలివెళ్లి దీక్షలో కూర్చున్నారు. నాయకులు దండుగుల వెంకటేష్, మోతే సుజాత, తదితరులున్నారు.

రూ. 7 కోట్లతో ఉప్పల్ డివిజన్ అభివృద్ధి

ఉప్పల్: డివిజన్‌లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా రూ. 7 కోట్లు మంజూరు చేసినట్లు కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సూర్యనగర్ కాలనీ, శ్రీరామ కాలనీ, లక్ష్మారెడ్డి కాలనీ, శేష సాయినగర్, సౌత్ స్వరూప్‌నగర్, కాలనీల్లో రూ. 2.08 కోట్లతో సీసీరోడ్లు నిర్మించనున్నట్లు వివరించారు. శేషసాయినగర్ ఉప్పల్ నల్ల చెరువు వరకు నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం రూ.1.95 కోట్లు, టీవీ కాలనీ శ్రీరమణపురం సీసీరోడ్లు నిర్మాణ పనులకు రూ. 90 లక్షలు, సత్యనగర్ కాలనీ, కమ్యూనిటీహాల్, సూర్యనగర్ కాలనీ సీసీరోడ్డు నిర్మాణానికి రూ. 1.86 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

లయోలాలో బాపు దివస్ వేడుకలు


వేడుకలను ప్రారంభిస్తున్న మెట్‌పల్లి ఖాదీ సంస్థాన్ చైర్మన్ తదితరులు

అల్వాల్: అల్వాల్‌లోని లయోలా అకాడమీలో ఐక్యూఏసీ–స్టూడెంట్ కౌన్సిల్, కేవీఐసీ స్టేట్ ఆఫీస్, తెలంగాణ భాగస్వామ్యంతో గాంధీ జయంతి సందర్భంగా సోమవారం బాపు దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెట్‌పల్లి ఖాదీ సంస్థాన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు, కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ లంక, లయోలా అకాడమీ ప్రిన్సిపాల్ ఫాదర్ డాక్టర్ ఎన్‌బీ.బాబులు హాజరై ఖాదీ, హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాదీ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు, ఖాదీ విక్రయదారులకు మద్దతును ఇచ్చి వారిని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. లయోలా అకాడమీ వైస్ ప్రిన్సిపాల్స్ ఫాదర్ డాక్టర్ జోసెఫ్, ఫాదర్ అరుల్‌జ్యోతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ఫాదర్ లూర్దు థామస్, డాక్టర్ భవానీ, శరత్‌చంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరహక్కుల చట్టంపై అవగాహన

కాప్రా: పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా కాప్రా గాంధీనగర్‌లో పౌరహక్కుల చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాప్రా మండలం డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, కుషాయిగూడ ఎస్సై వెంకన్న స్థానికులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. పౌరులకు ప్రత్యేకంగా మహిళలు, యువతకు ఎలాంటి అసౌకర్యం కలిగించే ఘటనలు ఎదురైనా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గాంధీనగర్ వాసులు బాలమ్మ, మణెమ్మ, అంజలి, ధనలక్ష్మి, శ్వేత, సత్యనారాయణ, బాలయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై వెంకన్న తదితరులు

పారిశ్రామికవాడలో గస్తీని పెంచుతాం



మాట్లాడుతున్న నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్

మల్లాపూర్: నాచారం పారిశ్రామికవాడలో గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసు గస్తీని పెంచుతామని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం నాచారం ఇండ్రస్టీస్ ఆసోసియేషన్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో పారిశ్రామికవేత్తలతో సమావే శం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఇన్‌స్పెక్టర్ హాజరై సీసీ కెమెరాల ఏర్పాటుపై అభినందించారు. విద్యుత్ ఏడీఈ దశరథ్, నాచారం ఐలా చైర్మన్ మహిపాల్‌రెడ్డి, కార్యదర్శి బాలరాజ్, వైస్ చైర్మన్ వెంకన్న, వెంకటేశ్వర్లు పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి

ఉప్పల్: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి పరుగులు పెడుతుందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉప్పల్ కురుమానగర్, ఉప్పల్‌హిల్స్ ప్రాంతంలో కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఉప్పల్ అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ఉప్పల్ హిల్స్‌లో రూ. 50 లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు వివరించారు. దుర్గం నవీన్‌యాదవ్, అబ్బయ్య, తోటి శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్, కుమారస్వామి, రవీందర్‌రెడ్డి, యాదగిరి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పరమేశ్వర్‌రెడ్డి, కాలనీవాసులు

భారీ వర్షం.. కాలనీలు జలమయం


రామంతాపూర్‌లో జలమయమైన రోడ్డు

రామంతాపూర్ : రామంతాపూర్‌లో సోమవారం కురిసిన భారీ వర్షానికి స్థానిక సత్యనారాయణ స్వామి దేవాలయం, నెహ్రూనగర్, టీవీ కాలనీ, శ్రీనివాసపురం తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.


విద్యుత్ తీగలపై పడిన చెట్లకొమ్మలు

చెట్లు కూలి విద్యుత్‌కు అంతరాయం..

◆ భారీ వర్షానికి చెట్లు కూలి విద్యుత్ తీగలపై పడటంతో దాదాపు 2 గంటల సేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా.. జీహెచ్‌ఎంసీ, సంబంధిత సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించి తిరిగి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యం

● పారిశుద్ధ్య కార్మికులకు రిక్షాల పంపిణీ ● స్వచ్ఛత ర్యాలీలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: పరిసరాల పరిశుభ్రతతో పాటు స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. సోమవారం స్వచ్ఛత ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం జీవించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి స్వచ్ఛ ఆటో సిబ్బందికి అందించాలని, ఖాళీస్థలాలు, రోడ్లపై చెత్త చెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉండేందుకు నడుం బిగిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం నగర పాలకసంస్థ ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు స్వచ్ఛ రిక్షాల పంపిణీ..

మౌలాలి/రామంతాపూర్ : మౌలాలి డివిజన్ పారిశుద్ధ్య కార్మికులకు రిక్షాలు, ట్రాలీలు పంపిణీ చేశారు. సోమవారం మౌలాలిలోని కార్పొరేటర్ కార్యాలయంలో మల్కాజిగిరి శానిటేషన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ పంపిణీ చేశారు. అజయ్, భారతి, అంజమ్మ, కిష్టమ్మ, మనీషా, అంజయ్య, సూర్య, ఎస్‌ఎఫ్‌ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో చిత్తశుద్ధి ఉండాలి..

మల్కాజిగిరి: చెత్త సేకరణలో చిత్తశుద్ధి ఉండాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. కార్మికులకు చెత్త సేకరణ రిక్షాలు, పుష్‌కాట్స్ పంపిణీ చేశారు. అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం జరుగుతుందని కార్పొరేటర్ పేర్కొన్నారు. దీనిలో భాగంగానే స్వచ్ఛత ర్యాలీలు, మానవహారం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్ చింత శ్రీనివాస్, ఎస్‌ఎఫ్‌ఏలు గిరి తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛత ర్యాలీలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్


పారిశుద్ధ్య కార్మికులకు రిక్షాలు అందజేస్తున్న కార్పొరేటర్ సునీత


కొత్త రిక్షాలను అందజేసిన కార్పొరేటర్ శ్రవణ్

ముగిసిన అంత్యక్రియలు.. పరామర్శ

మల్లాపూర్: మాజీ మేయర్ బొంతు రాంమోహన్ మాతృమూర్తి బొంతు కమలమ్మ అంత్యక్రియలు మల్లాపూర్ వైకుంఠధామంలో పూర్తయ్యాయి. చర్లపల్లి రెడ్డి కాలనీ ఇంటివద్ద పలువురు కమలమ్మ భౌతికకాయానికి మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆరెకపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు, బేతి సుభాష్‌రెడ్డి, గాదరి కిషోర్, బాల్క సుమన్, బాలుమల్లు, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, స్వర్ణరాజ్, మాజీ కార్పొరేటర్లు పలువురు నివాళుర్పించి బొంతు రాంమోహన్‌ను ఓదార్చారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ


చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌కు చెందిన రమేష్‌కి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.48000 చెక్కును సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేతులమీదుగా అందజేశారు. అర్హులైన వారు సీఎం రిలీఫ్‌ఫండ్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల పక్షాన సీపీఎం పోరాటం

ఉప్పల్: మూసీ వెంట నిరుపేదల ఇళ్లు ఖాళీ చేయించాలన్న ఆలోచనలను ప్రభుత్వం మానుకోవాలని, పేదల ఇళ్లు కూల్చొద్దని డిమాండ్‌తో అక్టోబర్ 4న సీపీఎం రాష్ట్ర స్థాయి నేతలు ఉప్పల్, కేసీఆర్, కేటీఆర్ నాలాలను సందర్శించి బాధితుల పక్షాన నిలబడి పోరాటం చేయనున్నట్లు ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ చెరుకుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు హాజరవుతారని వివరించారు.

◆ ఉప్పల్ డివిజన్ పరిధిలో దేవేందర్‌నగర్‌శాఖ కార్యదర్శిగా భీష్మాచారిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

స్వచ్ఛత అందరి బాధ్యత


అల్వాల్‌లో మొక్కలు నాటుతున్న సర్కిల్ అధికారులు

అల్వాల్: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా అల్వాల్ సర్కిల్ అధికారులు సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో చెత్తచెదారం లేకుండా శుభ్రపరిచి, పరిశుభ్రతపై అవగాహన కల్పించి అనంతరం మొక్కలు నాటారు. పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అల్వాల్ సర్కిల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి, సూపరింటెండెంట్ స్వామి, ఏఎంహెచ్‌ఓ రజని, శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రభాకర్, హార్టికల్చర్ అధికారిని ప్రవీణ, ఎస్‌ఎఫ్‌ఏ వెంకటేష్, చిత్తారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: విష్ణుపురికాలనీలో సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సోమవారం ఆయన పలు కాలనీల్లో పర్యటించి నివాసాల వద్ద వేస్ట్ మెటీరియల్స్‌ను యజమానులు తొలగించాలని సూచించామన్నారు. రహదారుల వెంట ఉన్న గ్రీన్‌వేస్ట్, డెబ్రిస్‌లను తొలగించాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందిని సూచించామన్నారు. స్ట్రీట్‌లైట్ సమస్యను పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ సత్యనారాయణను కోరామన్నారు. ఇంజినీరింగ్ విభాగం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కాలనీవాసులు శ్రీనివాస్‌యాదవ్, నాగరాజ్, శర్మ, బాబునాయక్, బీటీనాయక్, రవీందర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పుస్తక సమీక్షలో విద్యార్థిని ప్రతిభ



రామంతాపూర్: పురిమల్ల ఫౌండేషన్ (ఖమ్మం) ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి పుస్తక సమీక్ష పోటీల్లో రామంతాపూర్‌లోని అమ్మ హైస్కూల్ విద్యార్థి గోలి హర్షితకు ప్రశంసాపత్రంతో పాటు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించింది. ఈ మేరకు సోమవారం స్కూల్ డైరెక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి హర్షితను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. పుస్తక సమీక్ష రాయాలంటే చాలా కష్టమైన పని అని అలాంటిది హర్షిత సాధించడం ప్రశంసనీయమన్నారు. తెలుగు పండిట్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించండి !


బాలకృష్ణనగర్‌లో పేరుకుపోయిన చెత్త

రామంతాపూర్ : బాలకృష్ణనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వెనుక రోడ్డులో గత కొన్ని రోజులుగా చెత్త, చెదారం పూర్తిగా నిండిపోయి దోమలతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారని సంక్షేమ సంఘం ప్రతినిధులు పడగం నాగేష్ పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి వాపోయారు. సంబంధిత ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని చెత్తను తొలగించాలని వారు కోరుతున్నారు.